నేటి నుంచి రాజమండ్రిలో భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ మహాసభలు

విశాలాంధ్ర - రాజమండ్రి : అఖిల భారత భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ ఏడవ మహాసభలు రాజమండ్రి నగరంలో శనివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. 26వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు సీపీఐ కార్యాలయం నుండి కంబాల చెరువు వరకు వేలాది మందితో ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం అక్కడ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇప్పటికే నగరంలోకి చేరుకున్న అఖిల భారత భవన నిర్మాణ కార్మిక సమైక్య జాతీయ అధ్యక్షులు విజయ కొని సేరి, జాతీయ కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు సరైన ఉపాధి అవకాశాలు లేక సంక్షేమ బోర్డు ఫలాలు సక్రమంగా అందక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం సంక్షేమబోర్డులోని నిధులు కోట్లాది రూపాయలు వారి ప్రభుత్వ కార్యకలాపాలకు వాడుకుంటూ కార్మికులకు ద్రోహం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఉమర్ వల్లి, సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాలం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బీవీ కొండలరావు, జిల్లా కన్వీనర్ కే రాంబాబు, మహిళా సమాఖ్య నాయకురాలు కే రమాదేవి, ఏఐటీయూసీ నాయకులు బి. రవిచంద్ర, చింతలపూడి సునీల్, జ్యోతి రాజు, కిర్లలా కృష్ణ, గోవిందరాజు, ఏఐటీయూసీ కార్యదర్శి అచ్చయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక స్పందనకు 55 అర్జీలు

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ప్రజల సమస్యల పరిష్కార నిమిత్తం ప్రతినెల ఆఖరు శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగు తుందని, ఈ స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని జిల్లా కలెక్టరు డా.కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కాకినాడ శుక్రవారం కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు డా.కృతికా శుక్లా..డీఆర్వో కె.శ్రీధర్ రెడ్డి, జెడ్పీ సీఈవో ఎన్.వి.వి. సత్యనారాయణ, కెఎస్ఈజెడ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమలతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 55 అర్జీలు అందగా వాటి పరిష్కారం నిమిత్తం ఆయా శాఖల అధికారులకు పంపించారు.

నూతన ఎస్ఐగా చంటి పదవీ బాధ్యతలు

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : కపిలేశ్వరపురం మండలం అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన ఎస్ఐగా జి. చంటి పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న ఎస్సై సంపత్ కుమార్ కోనసీమ జిల్లా, అమలాపురం బదిలీ అయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్ పురం నుండి కోనసీమ జిల్లా రావులపాలెంలో ఎస్సైగా చేసి అనంతరం నూతన ఎస్సైగా కపిలేశ్వరపురం మండలం అంగర పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు అందరూ సహకరిస్తే అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు. పోలీసులకు సహకరించాలని, మండలంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకుంటానని అన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

విశాలాంధ్ర - దేవరపల్లి : అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ పనిచేస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకటరావు అన్నారు. మండలం బంధపురంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో తమ ప్రభుత్వం సమపాళ్లలో సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తమ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో ఇండ్ల నిర్మాణానికి ప్రాథమిక పనులు పూర్తయ్యాయని, మరో రెండు నెలలలో ఇండ్ల నిర్మాణం చేపడతామన్నారు. మండల పరిషత్ అధ్యక్షుడు కె.వి.కె. దుర్గారావు మాట్లాడుతూ డ్రైనేజీల నిర్మాణానికి రూ.16 లక్షలు ఖర్చు చేశామన్నారు. ఎన్ ఆర్ ఈ జి యస్ ద్వారా రూ. 30 లక్షలతో పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కల్లూరి ఉమామహేశ్వర శర్మ, తహశీల్దార్ రామకృష్ణ, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఎంపీటీసీ కాశీ విశ్వనాథం, పెన్నుబోతుల సుబ్బారావు, బాల వెంకట సుబ్బారావు, సుంకర గంగరాజు, సుంకర వెంకటేశ్వరరావు, సుంకర శ్రీనివాస్, కాండ్రు రామకృష్ణ, కవల శ్రీనివాస్, జానకిరామ్, అస్మత్ ఉన్నేసా తదితరులు పాల్గొన్నారు.

పేపర్ రీ సైక్లింగ్ పై అవగాహన

విశాలాంధ్ర - తాళ్ళపూడి : స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వామ్యం చేసే క్రమంలో ఐటీసీ కంపెనీ రీ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. శుక్రవారం తాళ్లపూడి లోని శ్రీ విజేత హై స్కూల్ లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల నుండి వేస్ట్ పేపర్ తీసుకుని దాని విలువలు సమానంగా విద్యా సంబంధ సామగ్రి అందివ్వనున్నారు. 5 కే జి ల కంటే పైగా వేస్ట్ పేపర్, పుస్తకాలను అందించిన వారికి ప్రశంసా పత్రం, స్కూల్ మొత్తం మీద మొదటి ద్వితీయ తృతీయ స్థానాలలో వేస్ట్ పేపర్ ను అందించిన వారికి మెడల్స్ అందజేయనున్నారు. విద్యార్థుల అవగాహనా కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ పేపర్ తయారీకి అనేక ఇంగ్రిడియంట్స్ వాడతారని, వాటి లభ్యత కష్ట సాధ్యమైన నేపథ్యంలో రీ సైకిల్ విధానంలో పేపర్ తయారీ పై ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్, వెంకట్, అనిత, కరుణ, సలోమి విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - ఏలేశ్వరం : 14వ ఆర్థిక సంఘం నిధులతో ఏలేశ్వరం నగరపంచాయితీ, 7వ వార్డులో కప్పల చెరువు పార్క్ నిర్మాణానికి రూ.32 లక్షలు, సిసి రోడ్డు నిర్మాణానికి రూ.రెండు లక్షలు, డ్రైనేజ్ నిర్మాణానికి రూ.ఆరు లక్షలు నిధులతో చేపట్టిన నిర్మాణాలకు కాకినాడ అధికార ప్రతినిధి పైల సుభాష్ చంద్రబోస్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పైలా అయ్యప్ప, ఆకుల బాబూరావు, సురేష్, పాండవులు, గెద్ద రామకృష్ణ, కల్లపల్లి శ్రీను, పైలా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ హిమాన్సు శుక్లా

విశాలాంధ్ర - అమలాపురం : వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పూర్తి సమన్వయం వహిస్తూ జాతీయ హెల్త్ మిషన్, సాధారణ నిధులు సకాలంలో వినియోగిస్తూ పేద రోగుల ఆరోగ్య పరిరక్షణలో కీలక భూమిక పోషించాలని జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి హెచ్‌డిఎస్, ఎన్ఆర్ హెచ్ఎంనిధులు వినియోగం, బిల్లుల జనరేషన్, ఔషధాలు సరఫరా, నిర్దేశిత లక్ష్యాల సాధన రోగులకు అందిస్తున్న వైద్య సేవలు సరళి, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరైన నిధులను ప్రాధాన్యత కార్యక్రమాలకు వినియో గిస్తూ పేద రోగుల ఆరోగ్య భద్రతకై పటిష్టమైన చర్యలు చేపట్టి, ఆరోగ్యకర సమాజ స్థాపన దిశగా ముందడుగు వేయాలన్నారు. ఇటీవల మంజూరైన నిధులు ముందుగా డైట్ కంట్రోల్ బిల్లులు బకాయిలను క్లియర్ చేయాలని ఆదేశిం చారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలు ఆసుపత్రులలో రోగులు తాకిడి ప్రబలుతున్న వ్యాధులు నియంత్రణ చర్యలు కీటక జనత వ్యాధులు నియంత్రణ ఔషధాలు సర్జికల్సు బడ్జెట్ వినియోగం మాతా శిశు మరణాలు రేటు తగ్గించడం గర్భిణీల ఆరోగ్య పరిరక్షణ రెగ్యులర్ ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్లను నియామ కాలు, జననీ శిశు సురక్ష కార్యక్రమం, ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహణ ఇత్యాది అంశాలపై వైద్యాధికారులతో సమీక్షించారు. నిర్దేశిత లక్ష్యాలు సాధనలో సిబ్బంది వెనుకబడి ఉండడం గుర్తించి లక్ష్యాలు సాధనలో గ్యాపులను పూరించేందుకై పనితీరు మెరుగుపరుచుకుని ఆశించిన రీతిలో పురోగతిని సాధించాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ పద్మశ్రీ రాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సిహెచ్ వి భరత్, లక్ష్మి గైనకాలజిస్ట్, ఆర్ సుప్రియ, గణాంకాధికారి కళాధర్, సీనియర్ అసిస్టెంట్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

దర్శిత్ తల్లిదండ్రులకు అన్ని విధాలా అండ

రాష్ట్ర హోం శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత

విశాలాంధ్ర - కాకినాడ : ఈ నెల 12న విద్యుదాఘాతానికి గురై కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దర్శిత్‌కు మెరుగైన వైద్య చికిత్సలు అందించడంతో పాటు తల్లి దండ్రులకు అన్ని విధాలా అండగా ఉంటామని రాష్ట్ర హోం శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో విద్యుత్ షాక్‌కు గురైన మూడు సంవత్సరాల బాలుడు దర్శిత్ ను, బాలుడు తల్లిదండ్రులను రాష్ట్ర హోం శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత.. కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీత, జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎస్పీ ఎం. రవీంద్రనాథ్ బాబు, జీజీహెచ్ వైద్య అధికారులతో కలిసి పరామర్శించారు. తొలుత జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో మంత్రి వనిత.. జీజీహెచ్ వైద్య అధికారులతో మాట్లాడి బాలుడు దర్శిత్ కు అందించిన వైద్యం వివరాలు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి ఇతర వివరాలను అడిగి తెలుసుకుని, బాలుడి తల్లిదండ్రులు వినోద్, చాందినిలను ఓదార్చారు. అనంతరం మంత్రి వనితా.. ఎంపీ, కలెక్టరు, ఎస్పీ జీజీహెచ్ సర్జికల్ వార్డులో చికిత్స పొందుతున్న దర్శిత్‌ను పరామర్శించారు. అనంతరం తానేటి వనిత మీడియాతో మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గం, తాళ్లపూడి మండలం పైడిమెట్ల గ్రామానికి చెందిన మూడు సంవత్సరాల బాలుడు దర్శిత్ ఈ నెల 12న హై టెన్షన్ వైరు తగలడంతో విద్యుత్ షాక్ కు గురయ్యాడని తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే హుటా హుటిన కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రికి తరలించి చికిత్స అందించడంతో పాటు ఎప్పటికప్పుడు వైద్యులతో సంప్రదించినట్లు ఆమె తెలిపారు. చికిత్స సమయంలో ఇన్ఫెక్షన్ కారణంగా బాలుడి రెండు కాళ్ళను వైద్యులు తొలగించారని, మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్య అధికారులను ఆదేశించామని తెలిపారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జీజీహెచ్ సుపరింటెండెంట్ డా. హేమలత, కూడ చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, అదనపు ఎస్పి శ్రీనివాస్ ఇతర వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా గనుల భూగర్భ శాఖ సర్వే

విశాలాంధ్ర - రౌతులపూడి : మండలంలోని మల్లంపేట, ఎస్ పైడిపాల, రాఘపట్నం, జల్దం పంచాయతీలలో నల్ల రాతి కొండలు పుష్కలంగా ఉన్నాయి. అక్రమార్కుల కళ్లు ఈ కొండలపై పడటంతో రాజకీయ నాయకులు అధికారుల అండదండలతో దోపిడీకి గురవుతున్నాయి. ఈ మధ్యకాలంలో ఒక క్వారీలో జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణం కోల్పోవడం ఇద్దరు గాయాలు పాలవడంతో పత్రికల్లో వచ్చిన వార్తలను చూసి గనుల భూగర్భ శాఖ జిల్లా నిఘా విభాగ అధికార యంత్రాంగం కదిలి వచ్చింది. నల్లరాతిని తరలించిపోతున్న లారీలు ప్రమాదంలో సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోయిన అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. కొన్ని పత్రికల్లో వీటిపై కథనాలు రాసినప్పటికీ అధికారులు ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు

విశాలాంధ్ర - అనపర్తి : వైఎస్ఆర్ జగనన్న కాలనీల్లో ఇళ్ళు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం బిక్కవోలు జగనన్న కాలనీలో విద్యుత్తు సరఫరా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సత్తి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ జగనన్న కాలనీలో 500 మంది లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణం మొదలు పెట్టడం జరిగిందని రూ.50 లక్షల వ్యయంతో విద్యుదీకరణ చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అవసరమైన మౌలిక కల్పిస్తూ పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రొంగల పద్మావతి అప్పాజీ, ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి శేషు కుమారి సత్యనారాయణ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి, సర్పంచ్ సరెళ్ళ సుమలత, ఎంపీటీసీ జంపా వెంకటలక్ష్మి, వీరబాబు, గంగాధర్ రెడ్డి, సత్తిరెడ్డి, టీవీ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర - అనపర్తి : మైనారిటీలతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచన చేసి వారి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా వక్ఫ్ బోర్డ్ మెంబర్‌గా నియమితుడైన షేక్ ఇబ్రహీం ఎమ్మెల్యే సత్తిని మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అనపర్తి, బిక్కవోలు మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులుగా ముస్లింలకే ఇచ్చినట్టు తెలిపారు. ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తున్న వైసీపీ విజయానికి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ముస్లిం సోదరులు తోడ్పడాలని ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), సర్పంచ్ వారా కుమారి, మండల కో ఆప్షన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మరో మినీ టౌన్ షిప్ కానున్న కొమరగిరి లేఔట్

- త్వరలోనే తొమ్మిది వేల ఇళ్ల నిర్మాణానికి చర్యలు
- రూ. 44 కోట్లతో మౌలిక సదుపాయాలు
- గృహ నిర్మాణ సమీక్షలో కమిషనర్ రమేష్

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : కాకినాడ సిటీ నియోజకవర్గ లబ్ధిదారుల కోసం స్థలాలు కేటాయించిన కొమరగిరి లేఔట్ త్వరలోనే మరో మినీ టౌన్ షిప్‌గా అవతరించబోతోందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే రమేష్ చెప్పారు. కార్పొరేషన్ కార్యాలయంలో అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావుతో కలిసి గృహ నిర్మాణ ప్రగతి పై శుక్రవారం హౌసింగ్, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారులతో కమిషనర్ సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమంగా ఉన్న గృహ నిర్మాణం విషయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని కోరారు. ముఖ్యంగా కొమరగిరి లేఔట్‌లో ఇప్పటికే 8500 మంది ఇళ్ల నిర్మాణం కోసం ఆమోద పత్రాలు కూడా ఇచ్చారని కమిషనర్ చెప్పారు. అతి త్వరలోనే ఇళ్ల నిర్మాణాలు కూడా వేగవంతంగా ప్రారంభం కాబోతున్నాయ న్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణం కాబోతున్న ప్రతి ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చే లక్ష్యంతో రూ.15 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ మంజూర యిందన్నారు. అలాగే కొమ్మరగిరి లేఔట్‌లోని 11 బ్లాక్‌లలో మంచినీటి రిజర్వాయర్ల ఏర్పాటు కోసం రూ.29 కోట్లు విడుదలైనట్లు కమిషనర్ చెప్పారు. అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ కొమరగిరి లేఔట్‌లో పునాదుల నిర్మాణానికి స్వయం సహాయక సంఘాల సభ్యులుగా ఉన్న గృహ నిర్మాణ లబ్ధిదారుల కోసం రూ.35 వేలు అందించే అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం. ఏసుబాబు, హౌసింగ్ డీఈ గుప్తా, ట్రాన్స్కో డిఈ ప్రసాద్, టిపిఆర్‌ఓ మానే కృష్ణమోహన్, నగరపాలక సంస్థ డీఈ శ్రీనివాస్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ కె. వీర వెంకట చౌదరి, టిడ్కో డిఈ రాజు, పలువురు ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

నేడు భారత రాజ్యాంగ దినోత్సవం

భారీ జనసమీకరణకు సన్నాహాలు

విశాలాంధ్ర - అమలాపురం : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా సాధన సమితి చైర్మన్ డిబి లోక్ తెలిపారు. శుక్రవారం స్థానిక గణపతి హెూటల్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగం నవంబర్ 26న రచించి దేశానికి అంకితం ఇచ్చారని ఈ సందర్భాన్ని పురస్కరించుకుని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా ఆవిర్భవించిన సందర్భంగా నవంబర్ 26న 50 వేల మందితో మాలలు ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతరప్రజా ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో గెడ్డం సురేషబాబు, ఇసుకపట్ల రఘుబాబు, నక్కా చంద్రశేఖర్, జడ్పిటిసిలు పందిరి శ్రీహరి, గెడ్డం సంపదరావు, వుండరు బాబ్జి, పెనుమాల చిట్టిబాబు, నక్కా సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చిత్రలేఖన పోటీల్లో రావులపాలెం బాలికలకు బంగారు పతకాలు

విశాలాంధ్ర - రావులపాలెం : చోడవరం చిత్రకళా నిలయం విశాఖపట్నం వారు ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రకళ పోటీలలో రావులపాలెం ఎస్‌విఎస్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. సువర్ణ కుమారి తెలిపారు. సీనియర్స్ విభాగంలో జి. భవన రుక్మిణీ, బి. అలైఖ్య, బి. లక్ష్మీ ప్రసన్నలు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు సాధించారు. జూనియర్ విభాగంలో యార్లగడ్డ రిషిక, జె. దివ్య వెంకట గంగాదేవి, కె. దుర్గాలక్ష్మి, ఎం. హేమ ప్రవల్లిక సుహాసిని, కె జ్ఞాన ముక్తేశ్వరిలు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలతో పాటు మెరిట్ సర్టిఫికేట్లను సాధించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సువర్ణ కుమారి బంగారు పతకాలు సాధించిన విద్యార్థినిలను వారిని తీర్చి దిద్దిన డ్రాయింగ్ టీచర్ డి వెంకట మధుమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు.

27న ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - గోకవరం : మండల ముఖ్య కేంద్రమైన గోకవరం మేజర్ గ్రామ పంచాయతీలో ఈనెల 27వ తేదీన ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ వైద్య శిబిరాన్ని ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహిస్తారు. షుగరు రక్తపోటు (బిపి) ఉచితంగా చూడనున్నట్టు రాజమహేంద్రవరానికి చెందిన డయాబెటిస్, ఎండోకాటన్ స్కిన్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ శేఖర్ రెడ్డి శుక్రవారం విలేకరులకు తెలియజేశారు. ఈ అవకాశాన్ని గోకవరం మండలంలోని 14 గ్రామ పంచాయతీలో గల ప్రజలు ఉపయోగించుకుని లబ్ది పొందాలని డాక్టర్ శేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

సిరిగలపల్లి లంకలో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర - కరప : కరప మండలం సిరిగలపల్లి లంకగ్రామంలో విష జ్వరాలు సోకడంతో ఆ గ్రామంలో పారిశుద్ధ్య పనులను త్వరితగతిని చేపట్టామని మండల పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న తుప్పలను తొలగించి, మురుగునీటి కుంటలను పూడ్చడం జరిగిందని ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వీరభద్రరావు పారిశుద్ధ్య సిబ్బందితో వీధులు శుభ్రం చేయించి డ్రైనేజీలను శుభ్రపరచి బ్లీచింగ్ పౌడర్ చల్లించి, దోమల వ్యాప్తి చెందకుండా మందు పిచికారి చేయించినట్టు శ్రీనివాసరావు పేర్కొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

మహిళలపై అకృత్యాలు ఆపాలి

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : మహిళలపై దేశవ్యాప్తంగా జరుగు తున్న అకృత్యాలు ఆపాలంటూ రాజవొమ్మంగిలో వెలుగు, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. ముందుగా వీరు వెలుగు కార్యాలయం వద్ద మహిళలపై జరిగే అకృత్యాలపై సమావేశం నిర్వహించుకొని అనంతరం ప్రధాన రహదారిగుండా ర్యాలీచేస్తూ ఆడపిల్లలపై అత్యాచారాలు, బాలికల అక్రమరవాణా, లైంగిక వేధింపులు, గృహహింస, అశ్లీల చిత్రీకరణ ఆపాలంటూ నినాదాలు చేశారు. అల్లూరి కూడలివద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకట లక్ష్మి, సర్పంచ్ గొల్లపూడి రమణి,సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి రామకృష్ణ, ఎస్ఐ టిజిఎస్ ప్రసాద్, ఏపీఎం ఆదినారాయణ, ఐసీడీఎస్ సీడీపీఓ మనమ్మ, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన హక్కులు, చట్టాల అమలుకై పోరాటం

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల హక్కులు,చట్టాలు పటిష్ట అమలుకై గిరిజనులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద గిరిజన సంఘం 5వ మండల మహాసభ గిరిజన సంఘం నాయకులు కాళ్ల రాజబాబు అధ్యక్షతన జరిగింది, ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రాంతంలో ఉన్న వనరులను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు గిరిజనుల హక్కులు, చట్టాలను తుంగలో తొక్కుతున్నాయని అన్నారు. గిరిజనులకు ఉద్యోగ అవకాశాలలో 100% రిజర్వేషన్ లభించే జీవో నెంబర్ 3 ని తక్షణం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం గిరిజన సంఘం నూతన మండల కమిటీ ఎన్నికైంది. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు టి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరావు హత్యకు నిరసనగా ప్రదర్శన

విశాలాంధ్ర-చింతూరు : తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండల పరిధిలో గల బెండాలపాడు అడవిలో రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు ను అక్రమ ఆక్రమణదారులు హత్య చేయటాన్ని నిరసిస్తూ చింతూరులో శుక్రవారం డివిజన్లోని అటవీశాఖ సిబ్బంది పెద్ద ఎత్తున నిరసన తెలుపుతూ ప్రదర్శన నిర్వహించారు. డియఫ్ఓ కార్యాలయం నుండి చింతూరు వీధిలోను ఎర్రంపేట గ్రామంలోనూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి ఎపి జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిఓ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా, అటవీ సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని నింపుతూ, అటవీశాఖ అధికారుల ప్రాణాలను రక్షించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐటీడీఏ పీఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ సాయిబాబా, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మోహిని విజయలక్ష్మి నాలుగు మండలాల అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి పశువుల మృతి

విశాలాంధ్ర - ఆలమూరు : అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గ్రామంలో రొక్కాల బాలరాజు అనే రైతుకి సంబంధించిన రెండు పాడి పశువులు(గేదెలు) విద్యుదాఘాతంతో మృతి చెందాయి. గురువారం పంట పొలాలలో గడ్డి మేయడం కోసం వెళ్ళి సాయంత్రం పశువుల మకాం వద్దకు తిరిగి రాకపోయేసరికి రైతు స్థానికులతో కలిసి శుక్రవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టాడు. దగ్గర్లోనే ఉన్న పంటపొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడిపోయి విద్యుత్ ఘాతానికి గురై పశువులు మృతి చెంది ఉన్నాయి. ఈ విషయాన్ని విద్యుత్ ఉన్నతాధికారులకు స్థానికులు చరవాణిలో తెలియజేయగా విద్యుత్ అధికారి (ఏడి) టి తిరుమల రావు, (ఎల్ఐ) టిఎస్ సుబ్బారావు సంఘటన స్థలానికి చేరుకోవడంతో స్థానికులకు అధికారులకు మధ్య కొంత సమయం వివాదం తలెత్తడంతో రైతు తనకు జీవనాధారమైన పశువులు మృతి చెందాయని సుమారు రెండు లక్షల విలువగల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు, ఉపసర్పంచ్ నాండ్ర నాగమోహన్ రెడ్డి స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువురి మధ్య ఎటువంటి వివాదాలు లేకుండా సానుకూల పరిస్థితిని ఏర్పాటు చేసి పశువుల రైతుతో మాట్లాడుతూ ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక సహాయానికి తగుఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక పశు వైద్యులు వినోద్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పశువులకు పోస్టుమార్టం చేశారు. పశువులకు ఇన్సూరెన్సు ఉంటే పరిహారం వస్తుందని ఆ తెలియజేశారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

విశాలాంధ్ర - మామిడికుదురు : ఆదుర్రు గ్రామానికి చెందిన వివాహిత పితాని నాగలక్ష్మీని అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్త, మామ, ఆడపడుచులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగరం ఎస్ఐ షేక్ జానీ బాషా తెలిపారు. అయినవిల్లి మండలం తొత్తరమూడి పెదపాలెంకి చెందిన పితాని గణేశ్వర రావుతో నాగలక్ష్మి కి 2019 నవంబర్ 6వ తేదీన వివాహం జరగగా రూ.1,70,000 కట్నం, 20,000 ఆడపడుచు కట్నం, మూడు కాసుల బంగారం ఇచ్చినట్లు నాగలక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. వీరికి ఒక పాప పుట్టిన తర్వాత నుండి అదనపు కట్నం కోసం వేధిస్తూ, సూటి పోటి మాటలతో హింసిస్తూ, కొట్టి బయటకు పొమ్మంటున్నారని తనకు న్యాయం చేయాలని భర్త గణేశ్వర రావు, అత్త గృహలక్ష్మి, మామ కృష్ణ మూర్తి, ఆడపడుచు భాగ్య శ్రీలపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు లో పేర్కొంది.

కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం మండలం గోపాలపురం ప్రధాన పంట కాలవలో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహాన్ని కనుగొన్నట్లు రావులపాలెం ఎస్సై వెంకట రమణ తెలిపారు. మృతుడి వయస్సు 40 నుండి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతుడి వంటిపై నల్లటి నిక్కరు ధరించి ఉన్నాడని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కై కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట రమణ తెలిపారు.

శ్రీచైతన్యలో ట్రాఫిక్ అవేర్నెస్

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక శాంతినగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో ఈనెల స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు అవగాహన నిమిత్తం 'ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రాం' పేరిట ప్రత్యేక సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలూరు సిటీ ట్రాఫిక్ సిఐ జి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వాహన చోదకులు పాటించవలసిన పలు నియమాలు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వలన అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివకుమారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని, నిర్లక్ష్య ధోరణిని పారద్రోలాలన్నారు.సభలో శ్రీచైతన్య విద్యాసంస్థల రీజనల్ ఇంచార్జ్ సుంకర పార్థసారథి, జోనల్ ఎకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ ఉదయభాస్కర్,ఎకడమిక్ డీన్ జే.సంజీవ్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రవీణ్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన మండల ప్రత్యేక అధికారి

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో వెల్లమిల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఉంగుటూరు మండల ప్రత్యేక అధికారి రమణ శుక్రవారం తనిఖీ చేశారు. జగనన్న గోరు ముద్ద పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జరుగుతున్న నాడు నేడు పనులు పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవీ సత్యవతి, సర్పంచ్ వస్మా కుమార్ రాజు ,పంచాయతీ సెక్రెటరీ బాలాజీ, బీసీ కమిటీ చైర్మన్ కే శివకుమార్ స్వామి ఉపాధ్యాయులు ఆర్ అనితా రాణి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర - గణపవరం : గ్రామంలో పరిసరాలను శుభ్రంగా ఉంచాలని గ్రామ సర్పంచ్ కొండేటి నరసింహ మూర్తి అన్నారు. శుక్రవారం గణప వరం మండలం వరదరాజపురం గ్రామ పంచాయతీలో సర్పంచ్ అధ్యక్షతన మన వరదరాజపురం అందరు భాగస్వామ్యంతో స్వచ్ఛత కొరకై మరియు ప్రజా సమస్యల పరిష్కారం కొరకై కార్యక్రమం నిర్వహించారు. దానిలో భాగంగా గ్రామంలో 1,2 వార్డులను వార్డు సభ్యులు గుర్రం సుబ్బారావు, రాపాక మార్తమ్మ, కార్యదర్శి ఆర్ డి వి ప్రసాద్, వలంటీర్స్, సచివాలయం సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఇంటింటికి తిరిగి తడి చెత్త, పొడి చెత్త మీద అవగాహన కల్పించడం, ప్రభుత్వ పథకాల గురించి వివరించడం, డ్రైన్స్, రోడ్స్ సమస్యల గురించి అడిగితెలుసుకొని, రోడ్స్ శుభ్రం చేశారు. దీనిలో 12 సమస్యలు డ్రైనేజీ, మహిళలు లైట్స్ గురించి చెప్పారు. వాటిని పరిష్కారిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.

గొర్రెల కాపరుల సంఘం ఎన్నిక

విశాలాంధ్ర- ముసునూరు: మండల కేంద్రమైన ముసునూరు పశు వైద్యశాలలో యదు శ్రీ గోకుల కృష్ణ గొర్రెల కాపరుల సంఘంఎన్నిక నిర్వహించినట్లు ఎన్నికల అధికారి, వైద్యులు ఎల్ .రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని ముసునూరు గోర్రెల కాపరులందరూ కలిసి యదు శ్రీ గోకుల కృష్ణ గోర్రెల సంఘం ఆధ్వర్యంలో ఒరుగు రంగరావు అధ్యక్షులుగా,సాయిల బాబురావు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పాకనాటి వెంకటేశ్వరరావు, కంపాసాటి కృష్ణ, మానికల శ్రీనివాసరావు ,చింతా భద్రాచలం, అంగిరేకుల రామారావు సభుత్యులుగా ఎంపికయ్యారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

విశాలాంధ్ర- ముసునూరు: మండలంలోని కోర్లగుంట శివారు సింహాద్రిపురం గ్రామంలోని 208 నెంబరు అంగన్‌వాడి కేంద్రాన్ని ముసునూరు మండలపరిషత్ అభివృద్ధి అధికారి కూచి పూడి సాయిరాము పరిశీలించారు. అంగన్‌వాడి విద్యార్థులకు చక్కటి భోజనం, విద్యా విధానం, పరిసరాలు పరిశీలించి,పరి శుభ్రంగా వుండాలని కోరారు.

షాదీఖానాను పరిశీలించిన జడ్పీ చైర్మన్

విశాలాంధ్ర - పాలకొల్లు : పట్టణంలో ఎల్ఆర్ పేటలో అసంపూర్తిగా వున్న ముస్లింల షాదీఖానా ను, జిల్లా పరిషత్ చైర్మన్ పాలకొల్లు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ తో కలిసి శుక్రవారం సందర్శించారు. అభివృద్ధికి నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, శంకరావు శ్రీను, మానుకొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురైన వ్యక్తికి టీడీపీ సాయం

విశాలాంధ్ర- తణుకు : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన కత్తవపాడు గ్రామానికి చెందిన అయినవల్లి రాజుకు టీడీపీ అండగా ఉంటుందని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్ సి సెల్ అధ్యక్షులు చుక్కా సాయిబాబు అన్నారు.శుక్రవారం బాధితుని ఇంటివద్దకు వెళ్ళి పరామర్శించారు. అనంతరం టిడిపి ఇరగవరం మండలం ఎస్ సి సెల్ కమిటీ తరపున రూ. 10 వేలు నగదు, బియ్యం, కూరగాయలు, నిత్యావసర వస్తువులు అందించారు.ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు గంటా శ్రీను, నియోజవర్గ సెక్రెటరీ ఎస్‌సి సెల్ కారెం బాబురావు, అధికార ప్రతినిధి కొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలతో భవనాలు నిర్మించండి

విశాలాంధ్ర- యలమంచిలి : నాణ్యత ప్రమాణాలతో ప్రభుత్వ భవనాలు నిర్మించాలని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. వడ్డిలంక గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ వైసీపీ ఇంఛార్జ్ కవురు శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు సకాలంలో పూర్తి చేయాలనీ లేదంటే కఠిన చర్యలు తప్పవని కాంట్రాక్టర్, అధికారులను హెచ్చరించారు. ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జీ, శిరగాలపల్లి సర్పంచ్ సుబ్బారావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

క్లాత్ బ్యానర్ల క్లస్టర్ ఏర్పాటుకు ప్రింటింగ్ యూనిట్లను ప్రోత్సహించండి

జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర - ఏలూరు : ప్లాస్టిక్, ఫ్లెక్స్ బ్యానర్లపై నిషేధం నేపథ్యంలో క్లాత్ బ్యానర్లు, నార, క్లాత్ సంచుల తయారీ క్లస్టర్ ను ఏర్పాటుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్నవెంకటేష్ ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్లెక్స్ బ్యానర్ల నిషేదం నేపథ్యంలో క్లాత్ బ్యానర్ల క్లస్టర్ ను ఏర్పాటు చేయడానికి ప్రింటింగ్ యూనిట్లను ప్రోత్సహించడంపై ఏలూరు నగరపాలక కమీషనరు, డిఆర్డిఏ పిడి, మెప్మా పిడిలతో సమన్వయం చేసుకొని అవసరమైన చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎపిఎఫ్ సిసిఐ ప్రతినిధి వంకాయల రామకృష్ణారావు, నగరపాలక సంస్థ కమీషనర్ షేక్ షాహిద్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి ఏసుదాసు, అసిస్టెంట్ డైరెక్టర్ సుమధురవాణి, ఎపిఐపిడిసిఎల్ ఎస్ఇ జి. శ్యాంబాబు, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ కృష్ణ ప్రసాద్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ రాంబాబు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

27న ప్రత్యేక వైద్య శిబిరం

విశాలాంధ్ర -భీమవరం : పట్టణంలోని మెంటే వారి తోటలోని సుందరయ్య భవనంలో ఈ నెల 27వ తేదీ ఆదివారం పక్షవాతం, పిట్స్, బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని దీనిని అవసరమైన వారు వినియోగించుకోవాలని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి.రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ వైద్య సహాయం అందించాలన్న ఆలోచనతో అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్యశాల కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నా మన్నారు. విజయవాడకు చెందిన డాక్టర్ గోపాలం శివన్నారాయణ, డాక్టర్ డి.సందీప్ వర్మ తదితరులు పాల్గొని వైద్య సేవలు అందిస్తారన్నారు. వైద్య శిభిరానికి వచ్చేవారు ముందు రోజు బీపీ ,షుగర్ పరీక్షలను బయట చేయించుకుని ఆ రిపోర్టులు తీసుకొని రావాలన్నారు. పాత రిపోర్ట్ లను ,వాడే మందులను కూడా తీసుకురావాలని వారు వివరించారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి

విశాలాంధ్ర - గోపాలపురం : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మనిషి కనీస ధర్మం అని టాగూర్ యూత్ సభ్యులు పేర్కొన్నారు. ఇటీవల విద్యుత్ ఘాతానికి గురై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పొందుతున్న జొన్నకూటి దర్శిత్ బాబు మెరుగైన ఆరోగ్యం కొరకు ఠాగూర్ యూత్ విరాళాన్ని సేకరించింది. శుక్రవారం మండలంలోని వాదాలకుంట గ్రామానికి చెందిన టాగూర్ యూత్ సేకరించిన రూ. 40,000 విరాళాన్ని ఇటీవల తాళ్లపూడి మండలం పైడిమెట్ల గ్రామానికి చెందిన జొన్నకూటి దర్శిత్ బాబుకు విద్యుత్ ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన సంగతి యూట్యూబ్ ద్వారా సమాచారం తెలుసుకున్న టాగూర్ యూత్ స్పందించి, విరాళాలు సేకరించారు. దర్శిత్ బాబు మెరుగైన ఆరోగ్యం కొరకు వైద్య సేవల నిమిత్తం ఠాగూర్ యూత్ సభ్యులు సేకరించిన రూ.40 వేల రూపాయలు నగదును ఠాగూర్ యూత్ సభ్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి దర్శిత్ బాబు తండ్రికి నగదు మొత్తాన్ని అందజేసి దర్శిత్ ఆరోగ్యంపై తండ్రిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఠాగూర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర - కుక్కునూరు : మండలంలో నెలకొన్న ప్రదాన సమస్యలను పరిష్కరించాలని వైసీపీ మండల నాయకులు తాడే పల్లి సిఎం క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.జూలై నెలలో వచ్చిన వరదలతో ముంపునకు గురైన ఇళ్ళకు నష్టపరిహారం ఇవ్వాలని,లంకాలపల్లి నుంచి వేలేరు గ్రామం వరకు మంజూరైన ఆర్ అండ్ బీ రోడ్డునిర్మాణాన్ని పూర్తి చేయాలని, పోలవరం ప్రాజెక్టు 41.15 కాంటూరు పరిధిలో ముంపునకు గురవుతున్న గ్రామాలకు వెంటనే ఆర్ అండ్ ఆర్ పరిహారం చెల్లించి, పునరావాస కాలనీలకు తరలించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్టు వైసీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావు వినోద్, మాదిరాజు వెంకన్నబాబు,పరవా రామిరెడ్డి,కుచ్చర్లపాటి కృష్ణంరాజు,పరవా రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి అమ్మవారికి సారె సమర్పించిన వావిలాల సరళాదేవి దేవి

విశాలాంధ్ర- తణుకు : తిరుపతిలో వేంచేసి ఉన్న శ్రీ తిరుచానూరు పద్మావతీ దేవి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పద్మశాలి ఆడబిడ్డ అయిన పద్మావతి అమ్మవారికి చీర సారె సమర్పించటం సాంప్రదాయంగా వస్తున్న నేపథ్యంలో గురువారం దేశం నలుమూలల నుంచి పద్మశాలిల కులస్తులు కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం గా నిర్వహించామని రాష్ట్ర వీవర్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళ దేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. . ఈసందర్భంగా కుటుంబం సభ్యులు అందరం పాల్గొని అమ్మ వారి కి చీర,సారె, పసుపు కుంకుమలు, మిఠాయిలు అమ్మ వారి కి సమర్పించామన్నారు.ఈకార్యక్రమంలో పద్మశాలి కార్పోరేషన్ చెర్మన్ జింకా విజయలక్ష్మి, అఖిలభారత పద్మశాలి అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఆంధ్ర అధ్యక్షుడు జెగ్గారపు శ్రీనివాస్, ఓబులపతి ,రాష్ట్ర చేనేత అధ్యక్షుడు గంజి చిరంజీవి, నీలి గిరిధర్,జెల్లై లక్ష్మి నారాయణ మరియు ప్రముఖ పెద్దలు,ప గో జిల్లా నుంచి వావిలాల వెంకట రమేష్ దంపతులు, వావిలాల పవన్ కుమార్ దంపతులు, కాకి శ్రీ నివాస్ ఏలురు,పద్మశాలి కార్పోరేషన్ డైరెక్టర్ ఆకుల కళ్యాణి , బందారు బెనర్జీ, సత్యనారాయణ జెంగారెడ్డిగూడెంబీరక ప్రసాద్,నీలం సత్య ప్రసాద్ దంపతులు తదితరులు పాల్గొన్నారు, సుమారు 500 మంది పద్మ శాలి కుటుంబాలు పాల్గొన్ని, ఎంతో వేడుకగా, మేళతాళాలతో ఊరేగింపు తో ఘనంగా నిర్వహించారు.అనంతరం వేదపండితులు ఆశీర్వాదములతో అందించిన ప్రసాదాలు భక్తులందరికి వావిలాల సరళ దేవిపంచారు.

ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-పెంటపాడు: స్థానిక పెంటపాడు గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 75వ ఎన్.సి.సి. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగాఎన్.సి.సి.,ఎన్ ఎస్. ఎస్. జంతు శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో పడాల గ్రామంలో గల జీవన సంధ్య వృద్ధాశ్రమానికి ఫలాలు, బిస్కెట్లు, 50 కేజీల బియ్యం తో పాటుగా ఒకరోజు భోజనం కు అయ్యే ఖర్చును విద్యార్థులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం. శ్యాంబాబు, ఎన్. సి. సి. ఆఫీసర్ లెఫ్ట్ నెంట్ ఎం.విప్రేమ్ సాగర్, ఎన్ సి సి కోఆర్డినేటర్ విజయబాబు, జంతు శాస్త్ర విభాగం నుండి జీ. వాణి, కుసుమ, ఇతరఅధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో వివిధ వ్యాస రచన, ఉపన్యాసం మరియు కనెక్ట్ విత్ యువర్ లైబ్రరీ పోటీలు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ మాట్లాడుతూ కళాశాల గ్రంథాలయంలో ఉన్న వనరులను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉపయోగించు కోవాలని సూచించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ఆధ్వర్యంలో తరుచూ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభ గుర్తించడంలో గ్రంథాలయ విభాగం సిబ్బంది కృషిని అభినందిస్తూ విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల డీన్ దా రవికుమార్ మాట్లాడుతూ లైబ్రరీలు వినియోగ దారులకు సమాచారం అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది అందుకే గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అన్నారు. బెస్ట్ లైబ్రరీ యూజర్ అవార్డు పొందిన ఫాకల్టీ మరియు స్టూడెంట్స్‌కు బహుమతులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయ అధికారి కే వెంకట రమణ, వివిధ శాఖల విభాగాధిపతులు, ఫాకల్టీ మెంబెర్స్, విద్యార్థులు మరియు గ్రంథాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అసైన్మెంట్ ల్యాండ్స్‌ను వంశపారపర్యంగా తిరిగి వారికే అప్పగించాలి

విశాలాంధ్ర - సీతానగరం : అసైన్మెంట్ ల్యాండ్స్‌ను వంశపారపర్యంగా తిరిగి వారికే అప్పగించాలని సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకుడు పలివెల వీరబాబు అన్నారు. సీతానగరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా జరిగిన మీడియా సమీపంలో రాష్ట్ర కమిటి సభ్యులు, జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనంతపురంలో జరిగిన బహిరంగ సభలో అసైన్మెంట్ ల్యాండ్స్ అన్ని చట్ట వ్యతిరేకంగా పేదలకు చెందాల్సిన భూమిని అన్యాయంగా అనుభవిస్తున్న వారికే ల్యాండ్స్‌ను రిజిస్ట్రేషన్ చేయాలనడం సరికాదన్నారు. ప్రభుత్వ భూమిని చట్టప్రకారం వంశపారపర్యంగా ఎఫ్ఎమ్‌యబి, అడంగులు, ఆర్ఓఆర్‌లలో ఉన్న పేరు కలిగిన వారికి మాత్రమే భూమిని తిరిగి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నెంబర్ నందమూరి చిట్టి స్వామి, నియోజకవర్గ అధ్యక్షుడు సిద్దే నాగరాజు, మండల మహిళా అధ్యక్షురాలు, పెద్దాపురం నియోజకవర్గ అధ్యక్షుడు పలివెల లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్లో కాపులకు మూడు వేల కోట్లు కేటాయించాలి

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర బడ్జెట్లో కాపులకు 3000 కోట్ల రూపాయలు కేటాయించాలని, కాపుల స్థితిగతులపై త్రీమేన్ కమిటీ నియమించిన ఆ కమిటీ ఇంతవరకు ఏం చేసిందో, ఆ నివేదికను బహిర్గతం చేయాలని ఆంధ్ర కాపు సద్భావన సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం కాకినాడలోని శుభం కాపు కళ్యాణ మండపంలో కాపు ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాపు సద్భావన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు అధ్యక్షత వహించగా కాపు జేఏసీ రాష్ట్ర సభ్యుడు ఆరేటి ప్రకాష్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ కాపుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కురసాల కన్నబాబు, అంబటి రాంబాబులతో కాపుల అధ్యయనానికి సంబంధించి కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించిందన్నారు. మూడేళ్లు దాటినా ఆ కమిటీ ఉందో లేదో, నివేదిక ఇచ్చిందో లేదో దాన్ని బహిర్గత పరచాలని ఆయన కోరారు. ప్రభుత్వ పరంగా కాపు కార్పొరేషన్కు 1000 కేటాయించాలని, విద్య రుణ పథకం అమలు చేయాలని, వ్యక్తిగత రుణాలు ఇంకా ఇతర పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బసవా ప్రభాకర రావు, పెద్దిరెడ్డి రామలక్ష్మి, రెడ్నం రాజా, అడ్డాల శ్రీలక్ష్మి, బాజిబోయిన వెంకటేష్ నాయుడు, పెంటపాటి చంద్రశేఖర్, గట్టి సత్యనారాయణ, చిట్నీడి శ్రీనివాస్, కంచుమర్తి సూర్యనారాయణ, పి సేతు మాధవరావు, దొడ్డిపట్ల అప్పారావు, సలాది మూర్తి, బిందాన సురేష్, కెవి రత్నాలు తదితరులు పాల్గొన్నారు.

వివాహితపై భర్త వేధింపులు, హత్యాయత్నం

పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

విశాలాంధ్ర - అంబాజీపేట : వివాహితపై భర్త, అతని కుటుంబ సభ్యులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనికి సంబంధించి బాధితురాలు నిట్టాల వీరవెంకట లక్ష్మీ దుర్గా పుష్పవల్లి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేటకు చెందిన తనకు, అంబాజీపేటకు చెందిన నిట్టాల నాగవెంకట సూరజ్‌తో 2020 అక్టోబరులో వివాహం జరిగింది. తన భర్త సూరజ్ సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా బెంగుళూరులో పనిచేస్తున్నారన్నారు. పెళ్లైన నాటి నుండి తనకు భర్త, బావ నిట్టాల నాగ సాయి కృష్ణ కుమార్, అత్త శేషరత్నం, మావయ్య బద్రినారాయణ నుండి వేధింపులు ప్రారంభయ్యాయన్నారు. తన భర్త తన తోటికోడలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూండటంతో తాను నిలదీశానని అప్పటి నుండి నా భర్త, కుటుంబ సభ్యుల నుండి వేధింపులు అధికమైయ్యాయన్నారు. 15 నెలల క్రితం తనకు నాగబదరీజోసన్ జన్మించాడని అప్పటి నుండి తాను పుట్టింట్లోనే ఉండిపోయామన్నారు. పెద్దల సలహా మేరకు ఆదివారం అత్తవారి ఇళ్ళ అంబాజీపేట వచ్చానని అప్పటి నుండి వేధింపులు తీవ్రతరమయ్యాయని, కనీసం ఆహారం, నీరు ఇవ్వకుండా హాలులోనే ఉంచారని, తాను ప్రాణ రక్షణ కోసం తలుపులు వేసుకంటే గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించి ఆ తలుపులను పెకిలించి నన్ను, నా కుమారుని చంపేందుకు ప్రయత్నించారని ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి భర్త, బావ, అత్త, మామలు తనను తీవ్రంగా గాయపరిచి బాబును చంపబోయారని అడ్డుపడిన తనను కూడా చంపేస్తానని కేకలు వేయడంతో తాను పోలీస్ స్టేషన్ను ఆశ్రయించానని పుష్పవల్లి తెలిపింది.

మహిళలు హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర - భీమవరం : ప్రతి ఒక్క మహిళ, బాలికలలో ధైర్యం , సమస్యను చెప్పగలిగే నేర్పరితనం, ఫిర్యాదు చేసే ధైర్యం ఉండాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు.శుక్రవారం బివి రాజు కళాశాల సమావేశ మందిరంలో మహిళలపై జరుగుతున్న దాడులు నిర్మూలన రోజు సందర్భంగా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు , బాలికలను రక్షించడానికి ఎన్ని చట్టాలు ఉన్న మనలో ఐక్యత లేకపోయినా, బాధితులకు సంఘీభావం తెలపకపోయినా మనకు ఉన్న హక్కుల గురించి అవగాహన లేకపోయినా వాటిని సమర్థవంతంగా వినియోగించుకోలేమని కలెక్టర్ అన్నారు. మన కళ్ళముందే ఒక మహిళకు అన్యాయం జరిగినప్పుడు దానిని అందరూ సామూహికంగా ఖండించడంతో పాటు బాధితురాలు పూర్తిస్థాయిలో సంఘీభావం తెలిపి ఆమె తరపున ధైర్యంగా పోరాడాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పాఠశాలల్లో చైల్డ్ లైన్ ఏర్పాటు చేయడం జరిగిందని దానిపై అవగాహన లేక ఎవరూ కూడా ఫిర్యాదులు చేయడం లేదని కలెక్టర్ అన్నారు. ప్రతి ఒక్కరిలో తమ హక్కుల పై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో మహిళలు, బాలికల హెల్ప్ లైన్ నెంబర్ పోస్టర్ను , ఇంటర్నేషనల్ డే ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ వైలెన్స్ ఎగైనెస్ట్ ఉమెన్స్ పోస్టర్ను కలెక్టర్ ఆవిష్కరించారు. మహిళలు, బాలికలు ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే 181, 112 హెల్ప్ లైన్ నెంబర్లు, చిల్డ్రన్స్ కోసం 1098 , పోలీసు వారి నెంబర్ 100 ఈ నంబర్లకు కాల్ చేసి తెలపాలని , వీటితోపాటు దిశ యాప్ ద్వారా సమస్యను తెలియజేయవచ్చునని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ మెంబర్ బూసి వినిత, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిని శోభారాణి , జిల్లాగిరిజన సంక్షేమ అధికారిని పుష్పరాణీ, బి వి రాజు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి శ్రీనివాసరాజు, జిల్లాలో ఉన్న అన్ని ప్రాజెక్టు సిడిపిఓలు, సిబ్బంది పాల్గొన్నారు. బి వి రాజు కళాశాల కమిటీ కోఆర్డినేటర్ పద్మ వాసవీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

తడిసిన ప్రతి ధాన్యం గింజా ప్రభుత్వం కొనుగోలు

విశాలాంధ్ర - కిర్లంపూడి : తడిసిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని పెద్దాపురం ఆర్డీవో జే సీతారామారావు అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడి సత్యదేవ కళ్యాణ కళ్యాణమండపం ఎదుట రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం గురువారం కురిసిన అకాల వర్షానికి తడిసిపోయాయి. దీంతో తడిసిన ధాన్యాన్ని,పచ్చిదాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కనుగోలు చేయాలని జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గం ఇంచార్జ్ పాఠం శెట్టి సూర్యచంద్ర ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో రైతులు ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో కిర్లంపూడి చేరుకుని తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, రైతుల గోడును ఆలకించారు. తడిసిన ధాన్యాన్ని కొనేందుకు అంగీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో జే సీతారామారావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో దళారీ వ్యవస్థను అరికట్టి, రైతులకు అన్ని విధాలా మేలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. రైతులు కష్టపడి పండించిన పంటను మోసపోయి తక్కువ రేటుకు అమ్ముకోవద్దని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఇచ్చి ప్రతి ధాన్యపు గింజా రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కెవి మాధవరావు, మండల వ్యవసాయ శాఖ అధికారిని జోకా అమృత, డిప్యూటీ తహసీల్దార్ ఎం శ్రీనివాస్ పలువురు రైతులు ఉన్నారు.

వేలంకలో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - కిర్లంపూడి : గడపగడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిదేనని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోమల గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురుంచి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే చంటిబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జడ్పీటీసీ తోట గాంధీ, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబి, భూపాలపట్నం ప్రసాద్, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపురెడ్డి బాబు, అల్లు విజయకుమార్, ఎంపీటీసీ గుతుర్తి రమణ,తదితరులు పాల్గొన్నారు.

అంజు ఇంటర్నేషనల్ ఐ కేర్ ఆసుపత్రి ప్రారంభం



విశాలాంధ్ర - మామిడికుదురు : మామిడికుదురు గ్రామంలోని పీపుల్స్ క్లినిక్‌ను అంజు ఇంటర్నేషనల్ ఐ కేర్ ఫౌండేషన్ ఆధునికీకరించిన అంజు కంటి ఆసుపత్రిని శుక్రవారం సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ కొమ్ముల సత్యనారాయణ స్వామి, డాక్టర్ కె విజయ లక్ష్మీ దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకినాడ అంజు కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ తేజ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 310 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 50 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరికి నూతనంగా ఏర్పాటు చేసిన హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామని డాక్టర్ తేజ తెలిపారు.

జిల్లాలో సజావుగా ధాన్యం కొనుగోలు



విశాలాంధ్ర - భీమవరం : జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతుందని రైతులు ఆందోళన చెందనవసరం లేదని జాయింట్ కలెక్టర్ జెవి మురళి అన్నారు.శుక్రవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జిల్లా అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జె వి మురళి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ప్రభుత్వం చేస్తున్న విశేష కృషికి అనుగుణంగా జిల్లాలో ఉన్న వ్యవసాయ శాఖ అధికారులు సమర్థవంతంగా పనిచేసి మంచి ఫలితాలను తీసుకువచ్చి జిల్లాకు వ్యవసాయ రంగంలో మంచి పేరును తీసుకు వస్తున్నందుకు జెసి వ్యవసాయ శాఖ అధికారులను ,సిబ్బందిని అభినందించారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ, మత్స్యశాఖ, ఇరిగేషన్, డ్రైనేజ్ తదితర శాఖలు సమన్వయంతో పని చేస్తే రైతుల సమస్యలు చక్కగా పరిష్కరించగలుగుతామన్నారు. ధాన్యం కొనుగోలు నూతన ప్రక్రియ ద్వారా రైతులకు రవాణా సౌకర్యాల్లో ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో ఇబ్బందులను తొలగించే విధంగా వ్యవహరించాలని జిల్లా జాయింటు కలెక్టరు జె వి మురళి అన్నారు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చాలా బాగా జరుగుతుందని ,డబ్బులు జమ త్వరగా జమ అవ్వటం పట్ల అయన హర్షం వ్యక్తం చేశారు. రైతులకు బరకాల సమస్య చాలా తీవ్రంగా ఉందని , కోరుకున్న ప్రతి రైతుకు బరకాలు అందించే కార్యక్రమం అధికారులు చేపట్టాలని కె. శ్రీనివాస రావు కోరారు.జిల్లా వ్యవసాయ సలహా మండల సమావేశంలో సభ్యులు కొట్టి కుటుంబరావు, ఉద్దరాజు విజయ రామ రాజు, జెడ్‌పి సిఇవో కెవియస్ఆర్ రవి కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, డి సి వో యం. రవి కుమార్,నాబార్డు డి డి యం టి. అనిల్ కాంత్, జిల్లా మత్స్యశాఖ అధికారి కె.ఎస్.వి నాగలింగాచార్యులు, జిల్లా వాటర్ రిసోర్స్ అధికారి పి.నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.